నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 12 నవంబర్ 2024 | HYDERABAD

రావిర్యాల చెరువులో చేప పిల్లలను వేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

సీఎన్‌జీ.. నో స్టాక్

సిటీబ్యూరో: గ్రేటర్‌లో ఇటీవల సీఎన్‌జీ వాహనాలు అధికంగా రిజిస్ట్రేషన్ అవుతున్నాయని ఆర్టీఏ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, ఇప్పుడు ఈ గ్యాస్ ధరలు కూడా పెట్రోల్, డీజిల్ ధరల దరిదాపుల్లోకి చేరుతున్నాయని డ్రైవర్లు చెబుతున్నారు. దీంతో సీఎన్జీ ఇంధన కొరత నాలుగు రోజుల నుంచి వెంటాడుతున్నది. నో స్టాక్ బోర్డులు బంకుల్లో దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం సీఎన్‌జీ కిలో ధర రూ.97కు చేరింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 450 పైగా పెట్రోల్ బంకులు ఉండగా, అందులో 95 స్టేషన్లలో గ్యాస్ పంపులు అందుబాటులో ఉన్నాయి. మరో 25 కేంద్రాల్లో సీఎన్‌జీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఆర్టీఏ లెక్కల ప్రకారం గ్రేటర్‌లో సుమారు 80 లక్షలకుపైగా వాహనాలు ఉన్నాయి. అందులో 10.35 లక్షల వరకు కార్లు ఉండగా, 1.46 లక్షల ఆటో రిక్షాలు, 80 వేల క్యాబ్ లు ఉన్నాయి. మొత్తం మీద సుమారు నాలుగు లక్షల వాహనాలు సీఎన్‌జీ, ఆటో గ్యాస్, లిక్విడ్, ఎల్పీజీ గ్యాస్‌ను వినియోగిస్తున్నట్లు తెలుస్తున్నది. ఆటో గ్యాస్, లిక్విడ్ గ్యాస్‌కు కొరత లేనప్పటికీ సీఎన్‌జీ పూర్తిస్థాయిలో సరఫరా లేదు.

కుల వృత్తులకు జీవం పోసిన కేసీఆర్

ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, నవంబర్ 11: కుల వృత్తులకు మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ జీవం పోశారని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజక వర్గం పరిధిలోని తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాల చెరువులో ఆమె సోమవారం చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూన్, జూలైలో చెరువుల్లో చేప పిల్లలను వదిలితే త్వరగా వృద్ధి చెందుతాయన్నారు. గతంలో ఐదు లక్షల పైచిలుకు రావిర్యాల చెరువులో చేపపిల్లలను వేసే వారని గుర్తు చేశారు. ఈ సారి 2.40 లక్షల చేప పిల్లలు మాత్రమే ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారన్నారు. ఐదు నెలల తర్వాత చెరువుల్లో చేప పిల్లలను వదలడం వల్ల వాటి ఎదుగుదల ఉండదన్నారు.

బల్దియా పూర్తిస్థాయి కమిషనర్‌గా ఇలంబర్తి

సిటీబ్యూరో, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): జీహెచ్ ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తికి పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా జీహెచ్ఎంసీ ఎఫ్ఏసీ కమిషనర్, రవాణాశాఖ కమిషనర్‌గా ఉన్న ఇలంబర్తిని జీహెచ్ఎంసీకి పరిమితం చేసింది. కాగా,ఇలంబర్తి ఝార్ఖండ్ రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్‌గా వెళ్లారు. ఆన్‌లైన్‌లో జీహెచ్ఎంసీ వ్యవహారాలను చూస్తున్నారు. మొత్తంగా పూర్తిస్థాయిలో జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియామకం కావడంతో పాలనపై మరింత పట్టు సాధించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

120 అక్రమ నిర్మాణాలను గుర్తించాం

త్వరలోనే సీజ్ చేస్తాం

గాజులరామారం టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి

దుండిగల్, నవంబర్ 11: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న అనుమతి లేని నిర్మాణాలపై సోమవారం'అధికారులు మారినా... ఆగని అక్రమ నిర్మాణాలు' పేరిట ప్రచురించిన కథనానికి టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించారు. సర్కిల్ పరిధిలోని గాజులరామారం, జగద్గిరిగుట్ట, చింతల్, సూరారం డివిజన్ల పరిధిలో జరుగుతున్న అనుమతులు లేనివి, అనుమతులకు మించి నిర్మిస్తున్న 120 అక్రమ నిర్మాణాలను గుర్తించినట్లు గాజులరామారం టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి తుల్జా సింగ్ పేర్కొన్నారు. ఇప్పటికే సదరు నిర్మాణదారులకు నోటీసులు అందజేసినట్లు చెప్పారు. నోటీసులు అందజేసిన నిర్మాణాలను త్వరలోనే సీజ్ చేస్తామన్నారు.

సున్నం చెరువు పరిశీలన

మాదాపూర్: మాదాపూర్ సున్నం చెరువులో హైడ్రా కూల్చివేతలతో రెండు నెలలుగా కరెంట్ లేక స్థానిక బాధితులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. బాధితులు చిన్న పిల్లలతో రాత్రివేళల్లో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం 'నమస్తే'లో అక్కడి పరిస్థితులను వివరిస్తూ.. 'బతుకంతా చీకటైంది' పేరిట కథనం రాగా, ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. ఏడీఈ మల్లేషం, ఏఈ సత్యనారాయణ సిబ్బందితో కలిసి సున్నం చెరువును సందర్శించి.. కరెంట్ స్తంభాలను పరిశీలించిన అనంతరం బాధితులతో మాట్లాడారు. హైడ్రా కూల్చివేతల అనంతరం సున్నం చెరువుకు రెండు నెలల నుంచి కరెంట్ లేకపోవడంతో బాధితులు కోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం నుంచి వచ్చిన ఆర్డర్ కాపీని తమకు అందించమని ఏడీఈ మల్లేషం బాధితులను కోరారు. పై స్థాయి అధికారులకు సున్నం చెరువు పరిస్థితులపై నివేదిక పంపి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఏడీఈ మల్లేషం బాధితులతో చెప్పారు. బాధితులు వారి వద్ద ఉన్న పత్రాలను ఏడీఈ మల్లేషంకు చూపించగా, 'విద్యుత్ సమస్యను త్వరలోనే పరిష్కరించేందుకు మా వంతు ప్రయత్నం చేస్తాం' అని చెప్పినప్పటికీ కరెంట్ విషయంలో భరోసాను ఇవ్వకపోవడంతో బాధితులు అసహనం వ్యక్తం చేశారు.

ఓటీఎస్ నిబంధనల్లో సడలింపు!

సిటీబ్యూరో: ఎట్టకేలకు ఓటీఎస్ నిబంధనల్లో మార్పులు తీసుకొస్తూ జలమండలి నిర్ణయం తీసుకున్నది. ఇప్పటికే ఓటీఎస్ పథకం ద్వారా ప్రయోజనం పొందిన వినియోగదారులు భవిష్యత్‌లో సక్రమంగా నీటి బిల్లు చెల్లిస్తామని, చెల్లించని పక్షంలో రద్దు చేసిన ఓటీఎస్ రాయితీ భారం తీసుకోవాలని నిబంధన పెట్టి బకాయిదారుడి నుంచి ఆఫిడవిట్ తీసుకుంటున్నది. ఈ నిబంధనపై పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడం..ఓటీఎస్ అమల్లో లోపాలను వివరిస్తూ 'నమస్తే' కథనాలను ప్రచురించింది. దీంతో ఎట్టకేలకు ప్రభుత్వానికి ఆఫిడవిట్‌ను సమర్పించే నిబంధనను సడలించి..దాని స్థానంలో హామీపత్రం సమర్పించే వెసులుబాటు కల్పించిందని జలమండలి పేర్కొన్నది.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో పేద ముస్లిం విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

షాడో నేతలు చెబితేనే లే అవుట్లకు అనుమతులు

ఆన్‌లైన్ విధానం జాన్తా నై.. సిఫారసు చేస్తేనే ప్రయారిటీ

లే అవుట్ పర్మిషన్ నుంచి బిల్డింగ్ ఓసీ వరకు ఒకప్పుడు ఆన్‌లైన్ వేదికగా ప్రక్రియ సాగిపోయేది. కానీ ప్రజాపాలన వచ్చాక ప్రాపర్ చానల్ విధానంలో జరుగుతున్నది. హెచ్ఎండీఏ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా షాడోల కనుసైగల్లో నిర్మాణ రంగ అనుమతులు వస్తున్నాయన్న చర్చ బిల్డర్లలో ఆసక్తికరంగా సాగుతున్నది. గాడిలో పడిన ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా అనుమతులు జారీ కావాల్సిన చోట ప్రభుత్వంలో పెద్దల సహకారంతో షాడో నేతల చేతుల్లోకి వెళ్లిపోయింది. చేపట్టే ప్రాజెక్టు ఎంత విస్తీర్ణంలో ఉందనేది పక్కనే పెడితే... ఎవరి పైరవీతో వచ్చిందనే అంశాన్ని ఉన్నతాధికారులు ప్రయారిటీగా తీసుకుంటున్నారన్న చర్చ హాట్ హాట్‌గా సాగుతున్నది. అందుకు అనుగుణంగానే ఫైళ్లను కదలిస్తున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగం నిర్వీర్యమైందనే వాదనలకు ఇటీవల జరిగిన కొన్ని ఉదంతాలే నిదర్శనంగా నిలుస్తున్నాయని అంటున్నారు. అధికారుల సిఫార్సులు, షార్ట్ ఫాల్స్ పక్కన పెడితే... షాడో నేతలను ప్రసన్నం చేసుకుంటే తప్ప... ఫైళ్లకు మోక్షం దొరకడం లేదనే విషయం మరోసారి స్పష్టమైంది. షాడో నేతలు ఓకే అంటే తప్ప.. ఫైళ్లను ముట్టుకునే వారే లేకపోగా, కనీసం ఫైల్ స్టేటస్ కూడా తెలుసుకునే పరిస్థితి హెచ్ఎండీఏలో లేకుండా పోయింది.

- సిటీబ్యూరో, నవంబర్ 11(నమస్తే తెలంగాణ)

మరోసారి చర్చనీయాంశం

హెచ్ఎండీఏలో కొందరి ఉన్నతాధికారుల పనితీరు మరోసారి చర్చనీయాంశంగా మారింది. వాళ్లు చేయాలనుకున్నదే ఫైల్, చేసిందే సంతకం అన్నట్లు అనుమతుల విషయంలో ముప్పుతిప్పలు పెడుతున్నారు. ముఖ్యంగా కమిషనర్, జాయింట్ కమిషనర్ పర్యవేక్షణలో జరగాల్సిన వ్యవహారాలన్నీ సీఎం సన్నిహితుల చేతుల మీదుగా జరుగుతున్నదనే ఆరోపణలు ఉన్నాయి. లే అవుట్, భవన నిర్మాణ అనుమతుల విషయంలో, సంస్థ చేపట్టే భారీ ఇంజినీరింగ్ ప్రాజెక్టుల టెండర్ల రూపకల్పన వరకు అన్నింట్లో జోక్యం చేసుకుంటున్నారు. ఇలా స్వతంత్రంగా జరిగిపోవాల్సిన వ్యవహారాలన్నీ బడా షాడో నేతల పైరవీలతో జరిగిపోతున్నాయి. ప్రాపర్ చానల్ కాకుండా వెళ్లిన వారికి లే అవుట్లు, భవన నిర్మాణ అనుమతుల విషయంలో చుక్కెదురు అవుతున్నది. ప్రభుత్వ పెద్దకు షాడోగా, మరో బలమైన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి హెచ్ఎండీఏ వ్యవహారాలన్నీ చేతి వేళ్లపై నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

షాడో నేతలు ఒకే చెబితేనే..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత హెచ్ఎండీఏ అధికారుల పనితీరులో చాలా మార్పులు వచ్చాయి. ఒకప్పుడు అన్ని ఆన్‌లైన్‌లోనే జరిగిపోతుంటే.. అంతగా అవినీతికి ఆస్కారం ఉండేది కాదు. ఇప్పటికీ ఆన్‌లైన్ విధానం అందుబాటులో ఉన్నా.. సంబంధిత ఫైళ్లకు షాడో నేతలు ఒకే చెబితేనే... మోక్షం వస్తుంది. చివరకు హెచ్ఎండీఏ కమిషనర్ పరిధిలో జరగాల్సిన వ్యవహారాలను కూడా షాడో నేతలే నిర్దేశిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వారి ఆదేశానుసారమే ఉన్నతాధికారులు కూడా అడుగులు వేస్తూ ఫైళ్లను పరిష్కరిస్తున్నారు. గతంలోనూ ఇదే తీరుగా రంగారెడ్డి జిల్లా కొంగర్‌కలాన్‌లో 17 ఎకరాల లే అవుట్ చేసిన బిల్డర్‌కు ఇదే రీతిలో చేదు అనుభవం ఎదురైంది. లే అవుట్‌కు సంబంధించి కిందిస్థాయి నుంచి కమిషనర్ ద్వారా తిరిగి చివరకు లే అవుట్ నిర్మాణానికి అనుమతి దక్కింది. ఆ లే అవుట్‌కు సంబంధించి రోజులు గడుస్తున్నా.. నేటికీ డీసీ లెటర్ మాత్రం రిలీజ్ కాలేదు. అదేమంటే త్రూ ప్రాపర్ చానల్ అంటూ ఆ ముగ్గురు పేర్లు సదరు బిల్డర్లకు వినబడ్డాయి. ఇదొక్కటే కాదు ఐదు ఎకరాల పైబడిన లే అవుట్, లే అవుట్ కం హౌసింగ్, ఐదు లక్షల ఎస్ఎఫ్‌టీతో కూడిన బిల్డింగ్‌లన్నీ హెచ్ఎండీఏలో కాకుండా త్రూ ప్రాపర్ చానల్ ద్వారానే అనుమతులు దక్కుతున్నట్లు రియల్ ఎస్టేట్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

కొంతకాలంగా పెండింగ్‌లోనే..

హెచ్ఎండీఏకు భారీ ఆదాయాన్ని తీసుకువచ్చే వాటిలో చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ ఒకటి. ఇతర జోన్ల నుంచి రెసిడెన్షియల్ జోన్లకు ఆయా భూములను మారుస్తూ ఎంఏయూడీ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది. ఇలా ఇప్పటివరకు దాదాపుగా 690కు పైగా సీఎల్‌యూ ఫైళ్లు ఎంఏయూడీ విభాగంలో మూలుగుతున్నాయి. ఏడాది కాలంలో ఏ ఒక్క ఫైలు కూడా ముందుకు సాగిన పరిస్థితి లేదు. ఈ శాఖకు షాడో మంత్రులుగా వ్యవహరిస్తున్న బడా నేతలు... చెప్పడమే ఆలస్యం... చకచకా ఫైళ్లపై సంతకాలతో ముందుకు పోతున్నట్లుగా తేలింది. అయితే కొన్ని ఫైళ్లకు మాత్రమే ఎందుకు మోక్షం దొరుకుతుందనే విషయాన్ని తెలుసుకునే క్రమంలో... వాటికి షాడో నేతల అనుగ్రహం పుష్కలంగా ఉందని తేలింది. దీంతోనే ఆ ఫైళ్ల విషయంలో ఆగమేఘాల మీద స్పందించి ఉన్నతాధికారులు చక్కబెడుతున్నారని వెల్లడైంది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామంలో సర్వే నంబర్ 15-32లో ఉన్న 20 ఎకరాల ఇండస్ట్రీయల్ భూమిని రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చాలంటూ 2023 కంటే ముందే దరఖాస్తు చేసుకున్నారు. పలు దఫాల స్క్రూటీ తర్వాత... ఏడాది కాలంగా పెండింగ్‌లోనే ఉంది. అయితే ఇటీవల ఈ ఫైలుకు సంబంధించిన వారు షాడో నేత సాయంతో మరోసారి ప్రయత్నం చేసినట్లుగా తెలిసింది. ఎంఏయూడీ ఉన్నతాధికారికి విషయం చేరిందే ఆలస్యం అన్నట్లుగా సంబంధిత ఫైల్‌కు క్లియరెన్స్ నిస్తూ... తుది గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లుగా తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇప్పుడు ఈ వ్యవహారం హెచ్ఎండీఏ పరిధిలోనే అత్యంత వివాదస్పదంగా మారితే... ఎంఏయూడీ ఉన్నతాధికారి పనితీరుకు ఇదొక కొలమానంగా మారింది.

శంకుస్థాపన చేశారు.. చర్చలతో సరిపెట్టేస్తున్నారు

ఎలివేటెడ్ కారిడార్‌పై ముందుకు కదలని ప్రభుత్వం

సిటీబ్యూరో: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు కేవలం శంకుస్థాపనలు, చర్చలకే పరిమితమైంది. ఇప్పటికీ రక్షణ శాఖ నుంచి తీసుకోవాల్సిన భూముల వ్యవహారం కొలిక్కి రాలేదు. కనీసం రక్షణ శాఖకు ఇవ్వాల్సిన పరిహార భూములను కూడా హెచ్ఎండీఏ వెతికి పట్టుకోలేక పోయింది. దీంతో శంకుస్థాపనలు చేసిన ప్రాజెక్టుల శిలాఫలకాలన్నీ దుమ్ము కొట్టుకుపోతున్నాయే తప్ప.. ప్రాజెక్టు పనులు మొదలయ్యే పరిస్థితి లేకుండాపోయింది. ఉత్తర తెలంగాణకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించాలనే లక్ష్యంగా గత ప్రభుత్వం పారడైజ్ నుంచి కొంపల్లి వరకు, జేబీఎస్ నుంచి తూంకుంట వరకు రెండు ఎలివేటెడ్ కారిడార్లను డిజైన్ చేసింది. రక్షణ శాఖతో భూ బదలాయింపు జరగకపోవడంతో ఖరారు చేసిన డిజైన్లను కార్యాచరణలోకి తీసుకురాలేకపోయారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయారు. భూములు ఇచ్చేందుకు రక్షణ శాఖ ఆమోదించినా.. ఇప్పటికీ భూ బదలాయింపుల కోసం చర్చలు జరుగుతూనే ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల కోసం దాదాపు 113 ఎకరాల కు పైగా రక్షణ శాఖ భూములు కోల్పుతుందనే అంచనాలు ఉండగా... ఇందుకు పరిహారంలో ఓఆర్ ఆర్ అవతల భూములను ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం జరిగింది. దీనికి తగినట్టుగానే హెచ్ఎండీఏ అధికారులు కూడా భూముల కోసం వెతికి అలసిపోయారు. దీంతో ఈ ప్రాజెక్టులకు అవసరమైన పరిహార భూముల అన్వేషణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు మారింది.

చర్చలతో కాలయాపన..

అధికారులు పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నా... ఇప్పటికీ పరిహార భూముల కోసమే రక్షణ శాఖతో చర్చలు కొలిక్కి రాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. రక్షణ శాఖ నుంచి పూర్తిస్థాయి క్లియరెన్స్ వచ్చినా... గుర్తించిన భూముల్లో ఉన్న నిర్మాణాలను తొలగించి, స్వాధీనం చేసుకోవడానికి మరో ఏడాది సమయం పట్టేలా ఉందని తెలిసింది.ఈ నెల 14న మరోసారి రక్షణ శాఖ అధికారులతో సమావేశం కానున్నట్లు సమాచారం.

సాఫీగా ఎయిర్‌పోర్టుకు

మరో ఎస్ఆర్‌డీపీ ఫలం అందుబాటులోకి..

ప్రారంభానికి ముస్తాబవుతున్న ఆరాంఘర్- జూపార్క్ ఫ్లై ఓవర్

రూ. 629.30 కోట్లతో 4.08 కిలోమీటర్ల మేర నిర్మాణం

కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఎస్ఆర్‌డీపీకి శ్రీకారం

సిటీబ్యూరో, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్ఆర్‌డీపీ) ఫలాలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తున్నాయి. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంలో భాగంగా గత కేసీఆర్ ప్రభుత్వం సిగ్నల్ రహిత ప్రయాణమే లక్ష్యంగా రూ. 5112.36 కోట్ల అంచనా వ్యయంతో 47 ప్రాజెక్టులు చేపట్టగా, తాజాగా రూ. 629.30 కోట్లతో ఆరాంఘర్ నుంచి జూపార్క్ వరకు ఆరు లేన్లతో 119 పిల్లర్లతో 4.08 కిలోమీటర్ల మేర చేపట్టిన భారీ ఫ్లై ఓవర్ ప్రారంభానికి తుది మెరుగులు దిద్దుకుంటున్నది. వచ్చే నెల మొదటివారంలో అందుబాటులోకి తెచ్చేందుకు ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్ఆర్‌డీపీలో ఇప్పటివరకు 36 ప్రాజెక్టులు అందుబాటులోకి రాగా, ఆరాంఘర్ ఫ్లై ఓవర్‌తో ఆ సంఖ్య 37కు చేరుకుంటుంది. ఇందులో 22 ఫ్లై ఓవర్లు, ఐదు అండర్ పాస్‌లు, ఆర్వోబీ/ఆర్‌యూబీ ఆరు, ఒక కేబుల్ బ్రిడ్జి, పంజాగుట్ట స్టీల్ బ్రిడ్జి, రహదారి విస్తరణ పనులను చేపట్టి అందుబాటులోకి తీసుకొచ్చారు. మొత్తంగా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఎస్ఆర్‌డీపీ ఫలాలు ఒక్కొక్కటిగా గ్రేటర్ ప్రజలకు రేవంత్‌రెడ్డి సర్కారు అందిస్తున్నది.

ఆరాంఘర్-జూపార్క్ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్ ఇలంబర్తి(ఫైల్)

సిగ్నల్ ఫ్రీ నగరంగా..

హైదరాబాద్‌ను సిగ్నల్ ఫ్రీ నగరంగా చేసేందుకు వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి ఫలాలు విడతల వారీగా ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయి. ఇందులో భాగంగానే పాతనగరంలో మరో ఫ్లై ఓవర్ అందుబాటులోకి రానున్నది. ఇప్పటికే ఓవైసీ ఫ్లై ఓవర్, అబ్దుల్ కలాం ఫ్లై ఓవర్, చాంద్రాయణగుట్ట ఫ్లై ఓవర్ అందుబాటులోకి తీసుకురాగా, ఆరాంఘర్-జూపార్క్ ఫ్లై ఓవర్‌తో శంషాబాద్ విమానాశ్రయం వరకు ప్రయాణం సాఫీగా సాగనున్నది. నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు రవాణా మెరుగుపరచడమే కాకుండా సిగ్నల్ ఫ్రీ రవాణా వ్యవస్థకు దోహద పడుతుంది.

కులం వరకూ ఓకే.. కానీ..

వ్యక్తిగత వివరాలు చెప్పేది లేదంటున్న జనం

సమగ్ర కుటుంబ సర్వేపై అనుమానాలు

బంజారాహిల్స్, నవంబర్ 11: 'కుల గణన అని టీవీల్లో చెబుతున్నారు.. మీరేంటి మేడం మా ఆధార్ కార్డులు అడుగుతున్నారు'.. అంటూ ఓ మహిళ ప్రశ్న. 'పేదోళ్లకు మేలు చేసేందుకు సర్వే చేస్తున్నామంటూ అపార్ట్‌మెంట్ల వద్దకు ఎందుకు వస్తున్నారం'టూ మరో వ్యక్తి నిలదీత. 'రేషన్ కార్డులు కావాలని గతంలోనే దరఖాస్తు చేశాం.. మళ్లీ రేషన్ కార్డు ఉందా అని ప్రశ్నలు ఏంటి' అని మరో మహిళ ఆగ్రహం.. ఖైరతాబాద్ నియోజకవర్గంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లకు ఎదురైన ప్రశ్నలివి. మూడురోజుల పాటు ఇండ్లకు స్టిక్కర్లు వేసిన సర్వే సిబ్బంది.. సోమవారం నుంచి ఇండ్లలోని కుటుంబాల వివరాలు సేకరించే పనిని ప్రారంభించారు. బంజారాహిల్స్‌చ జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ల పరిధిలో సర్వేకు వెళ్లిన వారికి స్థానికుల నుంచి సహకారం లభించడం లేదు. కుటుంబస భ్యులకు చెందిన పేర్లతో పాటు కులం, వృత్తి చెప్పేందుకు మాత్రమే కొందరు ఇష్టపడుతుండగా,మరికొంతమంది మాత్రం సర్వే ఎందుకు చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. మరికొంతమంది తమను ఫోన్ నంబర్లు, ఆధార్ కార్డు నంబర్లు చెప్పాలని కోరిన సర్వే సిబ్బందిని అనుమానంగా చూస్తున్నారు. సొంతిళ్లు ఉన్నవారు సైతం తమది కిరాయి ఇల్లు అంటూ చెబుతుండగా, మరికొంతమంది తమ పిల్లలు ఉన్నప్పుడు రావాలని చెప్పి ముఖం మీదనే తలుపులు వేసుకుంటున్న దృశ్యాలు కనిపించాయి. దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కుల గణన చేస్తున్నామని ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ప్రకటనలు చేస్తున్న తరుణంలో ఇండ్ల వద్దకు వచ్చి కులంతో పాటు 75 రకాలైన ప్రశ్నలు అడుగుతుండటంతో సిబ్బందితో జనం వాగ్వాదానికి దిగుతున్నారు.

లక్ష జీతం ఇచ్చి..!

ఇతర రాష్ట్రాల ముఠా సభ్యులను తీసుకుంటూ..

మాజీ కానిస్టేబుల్‌కు అంతర్రాష్ట్ర స్థాయిలో నెట్‌వర్క్

కీలకంగా మారిన హతుడి పార్ట్‌నర్

సిటీబ్యూరో:దొంగల ముఠాల మధ్య ఏర్పడ్డ అధిపత్య పోరు, ఆర్థిక వివాదాల నేపథ్యంలో దొంగల ముఠా నాయకుడైన మాజీ కానిస్టేబుల్ మేకల ఈశ్వర్‌ను తన ప్రత్యర్థులు కారుతో ఢీకొట్టి హతమార్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో తాజాగా నలుగురిని సరూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. 2010 బ్యాచ్‌కు చెందిన మేకల ఈశ్వర్ దొంగలతో చేతులు కలిపి, ముఠాలను ఏర్పాటు చేసుకొని దొంగతనాలు చేయించాడు. 2022లో నల్గొండ పోలీసులు దొంగల ముఠాను విచారిస్తున్న క్రమంలో ఈశ్వర్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ క్రమంలోనే ఈశ్వర్ తన పాత మిత్రుడైన శంకర్‌ను భాగస్వామిగా చేర్చుకున్నాడు. ఇద్దరు కలిసి అంతర్రాష్ట్ర దొంగల ముఠాలను నిర్వహిస్తూ నేర సామ్రాజాన్ని విస్తరించారు. ఈ క్రమంలో ఇతర ముఠాలతో విబేధాలు ఏర్పడ్డాయి. ఈశ్వర్‌కు, తన భాగస్వామి మధ్య సైతం ఆధిపత్య పోరు, ఆర్థిక పరమైన విభేదాలు వచ్చాయి. ఈ విషయం నగరంలో ఉన్న ఇతర దొంగల ముఠాలకు కూడా సమాచారం అందింది. ఈ నేపథ్యంలోనే మాట్లాడుకుందామంటూ పిలిపించి మందమల్లమ్మ ఫంక్షన్ హాల్ చౌరస్తాలోని ఒక బార్‌లో సిట్టింగ్ పెట్టారు. ఆ తర్వాత బార్ నుంచి బయటకు వచ్చిన ఈశ్వర్‌ను తన ప్రత్యర్థులు కారుతో ఢీకొట్టి హత్యాయత్నం చేశారు. చికిత్స పొందుతూ గత శనివారం ఈశ్వర్ మృతి చెందాడు.

నలుగురు నిందితుల అరెస్టు

ఈశ్వర్ తన భాగస్వామితో పాటు మరికొందరు దొంగల ముఠాల నాయకులు తమిళనాడు, కర్ణాటక, ఏపీతో పాటు తెలంగాణలో నుంచి తమ గ్యాంగ్‌లోకి సభ్యులను తీసుకుంటున్నట్లు సమాచారం. ఇలా నెల రోజులకు ఒక్కో దొంగల జంటకు(ఇద్దరు యువకులు) లక్ష రూపాయలు ఇస్తున్నట్లు సమాచారం. ఈశ్వర్, శంకర్ సుమారు 30 వరకు టీంలను అంతర్రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్నట్లు సమాచారం. కాగా, ఈశ్వర్‌ను హత్య చేసిన ఘటనలో సోమవారం నలుగురిని అరెస్ట్ చేసినట్లు సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి వెల్లడించారు. ఈశ్వర్ పార్ట్‌నర్ శంకర్ పట్టుబడాల్సి ఉందని, అతడిని విచారిస్తేనే దీని వెనుక ఇంకా ఎవరెవరూ ఉన్నారనే విషయం బయటకు వస్తుందన్నారు. శంకర్ కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.